సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తన నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మల్కాజిగిరికి చెందిన రవీందర్‌కు రూ.20 వేలు, గౌతంనగర్‌కు చెందిన భాగ్యలక్ష్మికి రూ.60 వేలు, ఎస్కే భాషాకు రూ.42 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో వెంకటేశ్ యాదవ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సంతోష్, సానాదిశంకర్, వినోద్‌యాదవ్, మోహన్‌రాజు , పార్థసారథి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై స్పీకర్‌కు ఫిర్యాదు



కాప్రా: ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణలో ప్రొటోకాల్ ఉల్లంఘించారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రొటోకాల్ పాటించని సంబంధిత అధికారులపై తక్షణమే చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పీకర్ కూడా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

కుషాయిగూడ: న్యాయవాదులు సమస్యలు పరిష్కరించాలి కోరుతూ ప్రముఖ న్యాయవాది సుంకర నరేశ్ కోరారు. ఈమేరకు ఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర, తమిళనాడు, కేరళ తరహాలో జూనియర్ న్యాయవాదులకు ఐదేళ్ల పాటు రూ. 5 వేలు స్టైఫండ్ ఇవ్వాలని, ఆరోగ్య బీమా కార్డుల పరిమితి రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని, ఇళ్లు లేని న్యాయవాదులకు స్థలం లేదా డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించేలా చూడాలని కోరినట్లు నరేశ్ పేర్కొన్నారు.

మూగజీవాలకు నీటిని అందించండి



నీటి తొట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: వేసవిని దృష్టిలో పెట్టుకుని మూగజీవాలకు నీటిని అందించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సిమెంట్ నీటి తొట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా జీహెచ్‌ఎంసీ సహకారంతో నీటి తొట్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ మారుతి, మూర్తి, గోపాల్, నాని, రమేశ్, బాబూరావు, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

అల్వాల్‌లో కార్పొరేటర్ పర్యటన



సూచనలు చేస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్‌లో తాగునీటి లీకేజీ అవుతుందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రేమ్, యాదగిరి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు షురూ



రామంతాపూర్‌లోని సెయింట్ జాన్స్ కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు,



రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో హాల్ టికెట్ పరిశీలించి లోనికి పంపుతున్న సిబ్బంది

కాప్రా: మండలంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ఉండగా, అరగంట ముందే విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. 16 కేంద్రాల్లో మొత్తం 3,470 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌తో పాటు ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ విధులు నిర్వహించారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని మండల విద్యాధికారి(ఎంఈఓ) బాపురెడ్డి తెలిపారు.



గౌతమ్ మోడల్ స్కూల్ సెంటర్ వద్ద ..

కాప్రా స్కూల్‌లో 240 మంది విద్యార్థులు..

కాప్రా జడ్పీ పాఠశాలలో మొత్తం 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం, చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ బాబు తెలిపారు. ఈ సెంటర్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌తో పాటు 12 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు.

ఉప్పల్ సర్కిల్ పరిధిలో..

రామంతాపూర్ : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్‌లో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.

మల్కాజిగిరి, అల్వాల్ మండల పరిధిలో..

మల్కాజిగిరి: మల్కాజిగిరి, అల్వాల్ మండల పరిధిలో పదో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మల్కాజిగిరి మండల పరిధిలో రెగ్యులర్ విద్యార్థుల కోసం 15 సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 3,219 మంది విద్యార్థులకు 7 మంది గైర్హాజరయ్యారు. అలాగే అల్వాల్ మండల పరిధిలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,630 మంది విద్యార్థులకు నలుగురు గైర్హాజరయ్యారు. మల్కాజిగిరి, అల్వాల్ మండలాలకు ఒకటి చొప్పున స్క్వాడ్ టీంను ఏర్పాటు చేశారు.

ఎన్నికల విషయాలపై తరచూ చర్చిద్దాం

● మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ ● పార్టీల ప్రతినిధులతో సమావేశం

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల సమయంలోనే కాకుండా తరచూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి సలహాలు, సూచనలను పరిగణలోనికి తీసుకుని భారత ఎన్నికల కమిషన్‌కు పంపుతామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో పార్టీల ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జనాభాతో పాటు ఓటర్ల సంఖ్య పెరుగుతుందని అందుకనుగుణంగా బూత్ లెవెల్ ఏజెన్సీలను నియమించాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఓటరు జాబితాను అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తూ మార్పుల వివరాలను బీఎల్‌ఏలు ఓటర్లకు తెలపాలని పేర్కొన్నారు. సాధారణ అభ్యర్థనలు ఏమైనా ఉంటే కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బూత్‌లను షిఫ్ట్ చేయడం కష్టమని, అవసరమైన మేరకు కొత్త పోలింగ్ బూతులు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు బూతుల్లో ఓటరుగా నమోదు ఉంటే వారు ఫామ్–8 లో బూతు మార్పునకు అప్లై చేసుకోవచ్చని సూచించారు. పార్టీ ప్రతినిధుల సూచనల మేరకు తండాలను పరిశీలించి అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇంకా ఏవైనా సందేహాలు ఉంటే తప్పనిసరిగా క్లియర్ చేసుకోవాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కుషాయిగూడలో ఉచిత వైద్య శిబిరం

కుషాయిగూడ: ట్రినిటీ ఆసుపత్రి సహకారంతో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న కుషాయిగూడ బస్టాప్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణిగౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు జరిగే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీలో శ్రీ భ్రమరాంభిక సమేత మల్లికార్జున ఆలయ పనులకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరై కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణాలతో కాలనీల్లో భక్తిభావం పెరిగి ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు.

'రాజీవ్ యువ వికాసం' పథకానికి దరఖాస్తు చేసుకోండి

సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువత 'రాజీవ్ యువ వికాసం ' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21–55 ఏళ్ల మధ్యనున్న అభ్యర్థులు ఉపాధి హామీ పథకానికి, 21–60 ఏళ్లు కలిగి ఉన్న అభ్యర్థులు భూసంబంధ, ఉద్యానవన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంవత్సర ఆదాయం (గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్ష, పట్టణ/మున్సిపాలిటీ వారికి రూ.2 లక్షలకు మించి ఉండవద్దన్నారు. మీ–సేవ నుంచి పొందిన కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంతో సహా 040–24020610 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ పథకానికి..

ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద ఉపకార వేతనాల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా అయ్యప్ప పంచలోహ విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

రామంతాపూర్: గోకుల్‌నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలోని స్వామి పంచలోహ విగ్రహాలను స్థానిక దూరదర్శన్ కేంద్రం నుంచి ఆలయం వరకు శుక్రవారం మేళా తాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతూరు శ్రీనివాస్ చారి, రేవు నరసింహ, డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గుప్తా, కుమారస్వామి, నగేశ్ గుప్తాదాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

● కాలం చెల్లిన పదార్థాలు ధ్వంసం, మరికొన్ని సీజ్
● నోటీసులు జారీ, పరీక్షల కోసం ల్యాబ్స్‌కు తరలింపు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పసుపు, కారం, మసాలాల తయారీ, నిల్వ, విక్రయ కేంద్రాలు, పలు రెస్టారెంట్లపై రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్నింటిని సీజ్ చేయటంతో పాటు మరికొన్నింటిని ధ్వంసం చేశారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్, శ్రీశిక, పి.స్వాతి, జగన్నాథ్‌తో కూడిన బృందం మేడ్చల్ జిల్లాలోని కిష్టాపూర్ సర్వే నంబర్ 819 , హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సూర్య మసాలా మరియు స్పైసెస్)లో తనిఖీలు నిర్వహించారు. మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాల్లో పరిశుభ్రత లేకపోవడం, అలాగే మసాలా ఉత్పత్తి ముడి పదార్థాలపై లేబుల్ సమాచారం లేదని తదితర వాటిని గుర్తించారు. నిర్వహణ విభాగంలో సరైన రికార్డులు కూడా లేవని వారు పేర్కొన్నారు. 46.75 క్వింటాళ్ల తయారైన సెమీ ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం–వెల్లుల్లి పేస్ట్), మసాలా పొడులు కలిగి ఉన్న రూ. 3 .03 లక్షల విలువైన నిల్వను సీజ్ చేసి, లోపభూయిష్టమైన నమూనాలను ల్యాబ్‌కి పంపించినట్లు పేర్కొన్నారు. సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. నివేదికలో కల్తీ అని నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని టాస్క్‌ఫోర్స్ ఫుడ్‌సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణా చేసి, విక్రయించే వ్యాపారులు ప్రజలకు సురక్షిత ఆహారం అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు నోటీసులు, సూచనలు జారీ చేశారు. అనుమతుల్లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని టీం హెడ్ వి.జ్యోతిర్మయి హెచ్చరించారు.

సీఎంకు ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



హబ్సిగూడ: బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం రవి కుమార్, రామంతపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తవిడబోయిన గిరిబాబు, సీనియర్ నాయకులు బరంపేట కృష్ణ ముదిరాజ్, విశ్వకర్మ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాల్కోట వెంకటాచారి, విశ్వకర్మ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పబ్బోజు భిక్షపతి చారి అసెంబ్లీ చాంబర్‌లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

వివాహిత అదృశ్యం



సౌజన్య

మేడిపల్లి: వివాహిత అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ సిద్ధివినాయకనగర్ కాలనీకి చెందిన పరశురాం, సౌజన్య (23) దంపతులు. ఏడేళ్లుగా ఇదే ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈనెల 19న సౌజన్య యాదగిరిగుట్టకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అదేరోజు సాయంత్రం సౌజన్యకు భర్త ఫోన్ చేయగా స్విచ్ఛాప్ రావడంతో పరశురాం మేడిపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'సిమాప్'లో ముగిసిన శిక్షణ తరగతులు



బోడుప్పల్: సీఎస్ఐఆర్ అరోమా మిషన్ ప్రాజెక్ట్ ఆర్థిక సహకారంతో కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రం (సిమాప్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా శాస్త్రవేత్త, ఇన్‌చార్జి జి.డి. కిరణ్‌బాబు హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, మహారాష్ట్రా నుంచి 70 మంది శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారన్నారు. వారికి సుగంధ, ఔషధ పంటల పెంపకం, ప్రాసెసింగ్ పద్ధతులు, వాటి ఆధారిత ఉత్పతులు, నాణ్యత, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించామన్నారు. సుగంధ తైలాల ట్రేడర్స్, డిస్టిలేషన్ యంత్రాల తయారీదారులు పాల్గొనగా రైతులకు ఉత్పత్తుల కొనుగోలుకు, నాణ్యమైన యంత్రాల సరఫరాకు వారు భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు పంటల సాగుకు ఆసక్తి కనబర్చినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

గౌతంనగర్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్ డివిజన్‌లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ తెలిపారు. న్యూవేంకటేశ్వరనగర్ కాలనీలో పాడైపోయిన పవర్ బోరుకు సొంత నిధులతో మరమ్మతులు చేయించి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో బాక్స్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



పవర్ బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

యువత స్వయం ఉపాధి సృష్టించుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ఉద్యోగావకాశాలు లేకున్నా యువత నిరాశ చెందకుండా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మీటూ స్టార్టప్'కు చెందిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత నూతన ఆలోచనలతో ముందుకెళ్లాలని ప్రభుత్వం నుంచి వచ్చే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జి.రాజు, శ్రీనివాసరెడ్డి, వెంకన్న, రాముయాదవ్, సాయి పాల్గొన్నారు.

వీధుల్లో నీటి తొట్ల ఏర్పాటు

ఉప్పల్: వేసవిని దృష్టిలో పెట్టుకుని మూగజీవాల కోసం ఉప్పల్ సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నీటి తొట్లను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిలో భాగమైన పక్షులు, మూగజీవాలను పరిరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఇంటి మీద, ఇంటి ఎదుట తొట్లను ఏర్పాటు చేసి నీరు పెడితే మూగజీవాలు తాగుతాయన్నారు.



ఉప్పల్ డివిజన్‌లో నీటి తొట్లను ఏర్పాటు చేస్తున్న కార్పొరేటర్ తదితరులు

కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డా. డి రంజిత్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డౌన్ సిండ్రోమ్ దినోత్సవం



ర్యాలీ తీస్తున్న అనురాగ్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు



సాధన దివ్యాంగుల సంస్థలో పాల్గొన్న వైద్యులు

కాప్రా: అంతర్జాతీయ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ స్కూల్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. నేరేడ్‌మెంట్, కుషాయిగూడలో పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్లకార్డులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్కూల్ వ్యవస్థాపకుడు డాక్టర్ రామ్ మాట్లాడుతూ..ప్రపంచంలో 1000 మంది పిల్లల్లో ఒకరు డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఏటా మార్చి 21న డౌన్ సిండ్రోమ్ దినోత్సవంగా పాటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బిందు, వాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాచారం సాధన దివ్యాంగుల సంస్థలో..

మల్లాపూర్: జెనిటిక్స్, పెటల్ మెడిసిన్ కమిటీ, ఫాగ్సి ఆధ్వర్యంలో నాచారం సాధన దివ్యాంగుల సంస్థలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డౌన్ సిండ్రోమ్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణులు, తల్లిదండ్రులు, ఆశా వర్క్‌ర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాధన మానసిక దివ్యాంగుల సంస్థ డైరెక్టర్ సురేఖా రెడ్డి, డాక్టర్ నవ్య, సాధన సంస్థ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఫాగ్సి వైస్ చైర్మన్ డాక్టర్ జాము నాదేవి, ఫాగ్సి సభ్యులు, ఉమాదేవి, జెనిటిక్స్, పెటల్ మెడిసిన్ కమిటీ, ఇండియన్ అకాడమీ ప్రిడియాట్రిసిన్ ట్విన్ సిటీ వైద్యులు, శ్రీకాంత్, సుచిరియ, కవిత, చారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోక్సో బాధితులకు భరోసా కల్పిస్తాం

మేడ్చల్‌రూరల్: పోక్సో కేసు బాధితులు స్వేచ్ఛగా తమ వాంగ్మూలం ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. మేడ్చల్ పట్టణంలోని భరోసా కేంద్రంలో వర్చువల్ ఎవిడెన్స్ సేవలను బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోక్సో కేసులో బాధితులు బయటకు తెలియకుండా కోర్టుకు వెళ్లకుండానే భరోసా కేంద్రం నుంచే వర్చువల్ గా వీడియో రికార్డింగ్‌తో తమ వద్ద ఉన్న ఆధారాలు కోర్టుకు సమర్పించవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్, బాలానగర్ జోన్‌ల పరిధిలో వచ్చే కేసులను ఈ కేంద్రం స్వీకరిస్తుందని తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన మాట్లాడుతూ.. 2022 మార్చిలో ప్రారంభమైన ఈ కేంద్రం ప్రత్యేకంగా మహిళల కోసం పనిచేస్తుందని తెలిపారు. లైంగిక కేసులు, పోక్సో కేసు బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా నేరుగా ఇక్కడికి తీసుకువచ్చి వారి స్టేట్‌మెంట్ రికార్డు, మెడికల్ టెస్టులు, అవగాహన కల్పించడం వంటి అన్నింటిని భరోసా కేంద్రం సిబ్బంది చూసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికి వరకు భరోసా కేంద్రంలో 281 కేసులు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మేడ్చల్ డీఐ సుధీర్ కృష్ణ, ఎస్‌ఐలు మన్మద్, అశోక్, అనిత, భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.



భరోసా కేంద్రంలో వర్చువల్ ఎవిడెన్స్ సేవలు ప్రారంభిస్తున్న మేడ్చల్ డీసీపీ